# వకుళ వెళ్ళిపోయింది




మినీ కథ

ఆ ఇంటి నిండా విచార మేఘాలు అల్లుకున్నాయి. పలకరిస్తే ఏడుపు వచ్చేలాగుంది వకుళ తల్లి వర్ధనమ్మగారికి. ఆమె తండ్రి భూషణంగారు కూడా మేకపోతు గాంభీర్యం తెచ్చిపెట్టుకున్నారే గానీ ఆయన మనసులో కూడా అగ్ని గుండాలు రగులుతున్నాయి. వకుళ ఇంత పని చేస్తుందని అనుకోలేదు. ఆమె మనసులో ఇలాంటి ఆలోచన లున్నాయని కూడా ఆయన కనిపెట్టలేకపోయారు. ఏమాత్రం తెలిసినా కొంచెం జాగ్రత్త పడేవారు. గత రాత్రి అందరూ మామూలుగానే పడుకున్నారు. తెల్లవారుతుండగా లేచిన వర్ధనమ్మ వీధి తలుపు గడియ లేకుండా ఉండడంతో కొంచెం భయపడుతూ వకుళ కోసం చూస్తే, ఆమె మంచం ఖాళీగా ఉంది. ఇల్లంతా వెతికినా కనిపించలేదు. తర్వాత వకుళ రాసిపెట్టిన ఉత్తరం కనిపించింది. అందులో రాసి పెట్టి పోయింది—తలిదండ్రులకు కష్టం కలిగిస్తున్నందుకు క్షమించమనీ, తనకు నచ్చిన చోటికి వెళ్ళిపోతున్నాననీ.

ఇరుగూ, పొరుగూ ఈ వార్త తెలిసి వచ్చారు. సానుభూతి చూపిస్తున్నారు.

"ఎంతో మంచి పిల్ల. ఇలా చేస్తుందని ఏనాడైనా అనుకున్నామా?" అని ఒకరు—

"పాపం! తలిదండ్రులకు ఎంత కష్టం వచ్చింది!" అని ఇంకొకరూ సానుభూతి తెలిపారు.

"దానికి మేం ఏం తక్కువ చేశామని ఇలా మా గుండెల్లో చిచ్చు పెట్టింది? కంటికి రెప్పలా చూసుకున్నాం. ఎంతో గారాబంగా పెంచాం. మా ఆశలన్నీ దాని మీదే పెట్టుకున్నాం. ఒకతే కూతురని కావలసినంత స్వేచ్ఛ ఇచ్చాం. దాన్ని ఇలా దుర్వినియోగ పరుస్తుం దనుకోలేదమ్మా!" వర్ధనమ్మ గారు ముక్కు ఎగబీల్చుకుంటూ అన్నారు.

"అది అడిగింది ఒక్కనాడు కూడా కాదని అనలేదు. ఈ ఒక్క విషయంలో మాత్రం వద్దన్నాం. అందుకని, ఇన్నాళ్ళ సంబంధం తెంచుకుని వెళ్ళిపోతుందా?" భూషణంగారు బాధపడుతూ అన్నారు.

"పోన్లెండి. ఏదో చిన్నపిల్ల. ఆవేశంలో చేసింది. మీరూ బాధపడుతూ కూర్చుంటే ఎలా?" అని సర్దిచెప్పాడు ఒక పెద్ద మనిషి.

అసలు విషయం ఏమిటంటే—

తరచుగా తనకు బదిలీలు అవుతూ ఉండటంవల్ల వకుళ చదువు పాడై పోతుందని, అలా కాకుండా ఉండాలని భూషణంగారు వకుళను తన అన్నగారి ఇంట్లోనే ఉంచి చదివించాడు ఎనిమిది సంవత్సరాలపాటు. అందువల్ల వకుళకు పెదనాన్న శ్రీపతిగారంటే మక్కువ ఎక్కువ. పైగా శ్రీపతిగారికి అసలు పిల్లలే లేరు కనుక వకుళనే కూతురిగా భావించారు.

ఆ తర్వాత ఏవో గొడవలు వచ్చి అన్నదమ్ములిద్దరూ శత్రువులై పోయారు. కనుక వకుళను అక్కడి నుంచి బలవంతంగా రప్పించి తమ దగ్గరే ఉంచుకున్నారు భూషణంగారు. రెండు నెలలు తిరక్కుండానే శ్రీపతి ఉత్తరం రాశాడు వకుళకు వెంటనే వచ్చెయ్యమనీ, ఆమె లేకుండా తను ఉండలేననీ. వీల్లేదని శాసించారు భూషణంగారు.

రాత్రికి రాత్రి వెళ్ళిపోయింది వకుళ పెదనాన్న దగ్గరకు ఒక ఉత్తరం రాసి పెట్టి. ఆ తర్వాత జరిగిన భాగవతమే అదంతా.

\- పాలకూర సీతాలత